క్లుప్తంగా

రైతులపై కేసులు తొలగించాలి


వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

జోగిపేట(అందోల్): కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. లగచర్ల రైతులపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దౌర్జన్యం నుంచి రైతులను ఆదుకోవాలని.. రైతులపై పెట్టిన కేసుల నుంచి విముక్తి చేయాలని వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ నాగభూషణం ,నాయకులు వెంకటేశం, మొగులయ్య, ఖాజాపాషా, గోపాల్, దుర్గేశ్, పోచయ్య, ప్రశాంత్ కుమార్, ఎండీ.రఫిక్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు



నారాయణఖేడ్: ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలపై మంగళవారం నారాయణఖేడ్ మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు చేసి వ్యాపారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను వినియోగించొద్దని సూచించారు. ఎవరైనా వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు ప్రత్యామ్నాయంగా చేతి సంచులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు


ఆభరణాలు ఊరేగిస్తున్న స్వాములు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపును మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్పవిగ్రహ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీ, ఆభరణాలను పట్టెలో ఉంచి స్వాములు నెత్తిపై పెట్టుకొని పాటలు పాడుతూ, నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపును కొనసాగించారు. దీంతో పట్టణ వీధులు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు గోపాల్‌రావు, సంతోష్, మహేశ్‌యాదవ్, కిరణ్, కృష్ణ, సుబ్రమణ్యం, అనిల్‌గౌడ్, శేఖర్, మాణిక్యం, అయ్యప్ప మల్లేశం, మాజీ కౌన్సిలర్ గాజుల నవీన్, ఆలయ పూజారి సంతోష్ పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి


పనులు ప్రారంభిస్తున్న కొలన్ రోజా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం 8వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిష్టయ్య, నాయకులు శ్రీనివాసరాజు, శారద, శ్రీను, రమేష్, కాలనీ మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

రావి ఆకుపై జాకీర్ హుస్సేన్



నారాయణఖేడ్: పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ మంగళవారం రావి ఆకుపై తబలా ఆర్టిస్టు జాకీర్ హుస్సేన్, తబాలా చిత్రాలను వేశాడు. జాకీర్ హుస్సేన్‌రే భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణం, పద్మవిభూషణం, అవార్డులను ప్రదానం చేయడమే కాకుండా అమెరికా సంయుక్త రాష్ట్రాలు సైతం నేషనల్ హెరిటేజ్ ఫిలోషిప్తో సత్కరించింది. రావి ఆకుపై ఆయన చిత్రాన్ని వేసి చిత్రకారుడు నివాళి అర్పించాడు.

రేడియల్ రోడ్డుకు మోక్షం ఎన్నడో!

- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


అసంపూర్తిగా రేడియల్ రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓఆర్ఆర్ 30ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ఐటీ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని శేరిలింగంపల్లి పరిధిలోని గోపన్‌పల్లితాండ నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదగా కొల్లూరు రింగ్ రోడ్డు వరకు ఓఆర్ఆర్ 30ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డును 2015లో మంజూరు చేసింది. కానీ, నేటికి రేడియల్ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈమార్గంలో వందల వాహనాలు తిరుగుతుంటాయి. దీంతో అనేక మంది ప్రమాదాల బారిన పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.. సుమారు 40కాలనీలకు అనుసంధానమైన రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు ఏళ్లుగా పోరాటం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్నపాపానపోలేదు. కాగా, ఈ రోడ్డు విషయం స్థానికులు ద్వారా తెలుసుకున్న రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత కొద్ది రోజుల క్రితం ఓవ్యక్తికి ఫోన్ చేసినట్లు తెలుస్తుంది. రోడ్డు విషయంపై పూర్తి వివరాలు అడిగితెలుసుకున్నట్లు తెలుస్తుంది. ఈ రోడ్డు విషయంపై స్థానికులు రెండురోజుల్లో మంత్రిని కలవనున్నారు. రేడియల్ రోడ్డుపై స్వయంగా మంత్రి ఆరా తీయడంతో ఈరోడ్డుకు త్వరలో మోక్షం లభిస్తుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి అన్నారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మండలంలోని లక్యానాయక్ తండా నుంచి రేగోడ్ మండలం కొండాపూర్ గ్రామానికి వేళ్లే రోడ్డును రూ.1.20 కోట్లతో బీటి రోడ్డు నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా గ్రామీణ రోడ్లను నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పత్రి విఠల్, మాజీ సర్పంచులు సంగారెడ్డి, శ్రీశైలం , నాయకులు పెద్దన్న పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి తనిఖీ చేశా రు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సీఐ హన్మంత్‌ను అడిగి హద్నూర్ పోలీస్‌స్టేషన్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల విషయంలో అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

17 గంటల్లో ఐదు ప్రసవాలు

న్యాల్‌కల్ పీహెచ్‌సీ రికార్డు


పీహెచ్‌సీలో పుట్టిన బిడ్డలతో తల్లులు

న్యాల్‌కల్(జహీరాబాద్): 17 గంటల్లో వ్యవధిలో ఐదు ప్రసవాలు చేసి న్యాల్‌కల్ పీహెచ్‌సీ రికార్డు సృష్టించింది. స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 16 సాయంత్రం నుంచి 17 ఉదయం వరకు 17 గంటల్లో 5 ప్రసవాలు జరిగాయి. తల్లులు, వారికి పుట్టిన బిడ్డలందరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. స్టాఫ్‌నర్స్ సబిత ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వీరందరికి సాధారణ ప్రసవాలు చేశారు. 17 గంటల్లో 5 ప్రసవాలు జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదని అధికారులు తెలిపారు. గంటల వ్యవధిలో ప్రసవాలు చేసిన స్టాఫ్‌నర్స్ సబితను డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవి, వైద్యుడు అమృత్‌రాజ్ అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుదర్శన్, వైద్య సిబ్బంది లక్ష్మి, ఆశా వర్కర్లు నర్సమ్మ, లక్ష్మి, అనుసూయ, సుశీల, అమృత తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: క్రైస్తవుల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని 33 చర్చిల పాస్టర్ల దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడు సంవత్సరాలుగా పాస్టర్ల కుటుంబాలకు నూతన వస్త్రాలు, భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. మంగళవారం దత్త జయంతి ముగింపు సందర్భంగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు ఓం నమశి వాయ పంచాక్షరి మంత్రంతో మార్మోగింది. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నేత్రపర్వంగా సాగింది. దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా, ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహరాజ్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, పార్వతీ పరమేశ్వరులకు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు జీలకర్రబెల్లం, కన్యాదాన తంతు నిర్వహించారు. వేదపండితులు నిర్ణయించిన సుముహూర్తంలో అమ్మవారి మెడలో పరమేశ్వరుడు మాంగల్య ధారణ చేశారు. వైదిక పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి మంత్రి దామోదర రాజనర్సింహ రూ. 14 లక్షలతో సీసీ రోడ్డును మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి తెలిపారు. సీసీ రోడ్డు పనులు పూర్తయితే ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మునిపల్లి(అందోల్): మండలంలోని అల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో లబ్దిదారుల పేర్లను నమోదు చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నారాయణ మంగళవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఇంటింటికి తిరిగి పేర్ల నమోదు చేస్తున్నారు.

దివ్యాంగులకు పనికల్పనలో భేష్


ప్రశంసాపత్రం అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో వికలాంగుల శ్రమశక్తి సంఘాలకు జిల్లాలోనే ఎక్కువ పనిదినాలు కల్పించినందుకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ కంగ్టి ఎంపీడీఓ ఎం.సత్తయ్యకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల అభ్యున్నతికి అందరు పాటుపడాలని, వారిలో మనోధైర్యాన్ని నింపి అందరితో సమానంగా జీవనం కొనసాగించేలా సహకరించాలని తెలిపారు. దీంతో మండలంలోని వికలాంగుల సంఘాల సభ్యులు ఎంపీడీఓకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వల్లూరు క్రాంతి, టీజీవిబీ చైర్మన్ నిర్మల, డీఆర్‌డీఓ జ్యోతి, జడ్జి రమేష్, అదనపు డీఆర్‌డీఓ బాలరాజు, జహీరాబాద్, మొగుడంపల్లి ఎంపీడీఓలు మహేందర్‌రెడ్డి, మహేష్, దివ్యాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లోని విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. డీడీఎస్ ఆధ్వర్యంలో ఉదయం న్యాల్‌కల్, మా మిడ్గి, హద్నూర్, మెటల్‌కుంట, రేజింతల్, మిర్జాపూర్(బి)తదితర జిల్లా పరిషత్తు పాఠ శాల్లో విద్యార్థులకు జీవ వైవిధ్యం అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు.న్యాల్‌కల్ పాఠశాలకు చెందిన రిజ్వాన్, విష్ణు, చంద్రకళ ప్రతిభ కనబరిచారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **రూ.20 వేలు విరాళం**

సంగారెడ్డి : సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలో భాగంగా జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి దీక్ష శిబిరానికి రూ. 20 వేలు విరాళం అందజేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చలేని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు, బీజేపీ నాయకులు ఉన్నారు .

◆ **మహా పడిపూజ**

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల కేంద్రంలో రాంమందిరం వద్ద మంగళవారం అయప్పస్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. మెట్ల పూజ, అభిషేకం, తీర్థప్రసాదం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి చెందిన దాత రమేష్‌గౌడ్ భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సంగప్ప సత్యనారాయణ, సాయిలు, అనిల్ గుప్తా, సంగమేశ్వర్‌గౌడ్, పాల్గొన్నారు.

◆ **మంచి ఫలితాలు సాధించాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి పీ.పీ.రాథోడ్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్ నగర్ కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె చేస్తున్న కారణంగా ప్రతిరోజు కస్తూర్బా పాఠశాలకు వచ్చి.. విద్యార్థులకు పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు. అలాగే, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

◆ **పంచాయతీ కార్మికుల నిరసన**

కల్హేర్(నారాయణఖేడ్): పెండింగ్ వేతనాలు చెల్లించాలని కల్హేర్ పోలీస్‌స్టేషన్ వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారని సీఐటీయూ కల్హేర్ మండల నాయకులు సాయిలు ఆరోపించారు.

◆ **ప్రత్యేక పూజలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీకాలనీ శ్రీరామాలయంలో మంగళవారం సీతారామచంద్ర స్వామి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి దంపతులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

◆ **మందుబాబుకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి రూ. 2 వేలు జరిమానా, మరో వ్యక్తికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **అనారోగ్యంతో ఫైర్ కానిస్టేబుల్ మృతి**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాలనీలో నివసించే సాయి స్వరూప్ (32) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు సాయి స్వరూప్ ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సాయి స్వరూప్‌కు భార్య, రెండు నెలల పాప ఉంది. ఇటీవలే ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందాడు. గత 25 రోజుల నుంచి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

◆ **పదవుల నుంచి తప్పుకోండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కురుమ కులస్తులను అడ్డుపెట్టుకొని రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందుతున్న వారు పదవుల నుంచి తప్పుకోవాలని రామచంద్రాపురం కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు కరికె సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య డిమాండ్ చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ.. కుల సంఘాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు మల్లేశం, జిల్లా అధ్యక్షుడు నగేశ్ రాజకీయ లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. మెజార్టీ కురుమ సభ్యుల ఆమోదం లేకుండా ఎన్నో ఎళ్లుగా తామే అధ్యక్షులమని చెప్పుకోవడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నరసింహ, వెంకటేశ్, కృష్ణకాంత్, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి


ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

సంగారెడ్డి : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు, ఉద్యోగం పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇన్‌చార్జి, ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్న వారిని గుర్తించకపోవడం దారుణమన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. రెండో పీఆర్సీలో కనీస వేతన రూ.26 వేలతో పాటు కేటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు డీఏ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, రాజు, శీను, యాదగిరి, నర్సింలు, లక్ష్మీనారాయణ, రాజేష్‌లక్ష్మి, వీరమణి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కార్పొరేటర్ పుష్ప అధికారులను ఆదేశించారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని బాలవిహార్ పార్కులో సివిల్ పనులు నత్తనడకన సాగుతున్నాయని వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు.అదే విధంగా హిందూ సన్మానవాటికలో మిగిలిన షెడ్, బర్నింగ్ ఫ్లాట్‌ఫామ్‌లు, నీటి బోరు, ఇతర పనులకు అధికారులు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిపాదనలు సిద్ధం చేస్తేనే నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. అలాగే, రామచంద్రాపురం పట్టణంలోని బస్సు రోడ్డును మరింత విస్తీర్ణం చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు శామ్యూల్ వినయ్ కుమార్, నాయకులు హబీబ్, ఐలేష్, నగేష్, శ్రీరాములు, సుంకు స్వామి, మల్లేష్, యాదయ్య, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయండి


కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

జోగిపేట(అందోల్): పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నాకు వెళ్తున్న నాయకులు, కార్మికులను జోగిపేట పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఇందిరా పార్కు వద్ద శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 6 నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.18 వేల వేతనం, మల్టీపర్పస్ విధానం రద్దు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో ఆందోల్ డివిజన్ సీఐటీయూ కార్యదర్శి విద్యసాగర్‌తో పాటు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పూర్తి కాకముందే ప్రారంభానికి సిద్ధం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్న శిలాఫలకాలు ప్రారంభించడం సరికాదన్నారు. ఐడీఏకాలనీ, బీసీకాలనీ, లక్ష్మీనగర్, జ్యోతినగర్ లో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తే శిలాఫలకాలు ప్రారంభించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అలా కాకుండా పాలకవర్గం హడావిడిగా శిలాఫలకాలను ప్రారంభిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాలమ్మ, గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మునీర్, కార్మిక నాయకులు లక్ష్మారెడ్డి, వరప్రసాద్ రెడ్డి, యువజన నాయకులు అబ్దుల్ బషీర్, ఇమ్రాన్, కృష్ణంరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నక్షబాటను కాపాడుతాం

హెచ్ఎండీఏ అధికారి స్వరూప


అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): తప్పుడు పత్రాలతో అనుమతులు పొంది ఊట్ల మంగంపేట గ్రామాల మధ్య ఉన్న నక్షబాటలో షెడ్డు నిర్మించడంపై గ్రామస్తులు హెచ్ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం హెచ్ఎండీఏ అధికారిణి స్వరూప కబ్జాకు గురైన లక్షబాటను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. షెడ్డు పేరుతో నక్షబాటను ఆక్రమిస్తూ భారీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారని, అలాగే, నాలాపై ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని అధికారిణికి గ్రామస్తులు విన్నవించారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని, నక్షబాటను కాపాడి, పనులు నిలిపివేస్తామన్నారు. నాలాపై నిర్మించిన ప్రహరీ గోడను తొలగిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. నక్షబాట కబ్జాను అడ్డుకోవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగులను సన్మానించారు. పెన్షనర్ల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు డీఏ, పీఆర్‌సీ ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డులు ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలని కోరారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌టీఓ నర్సింహ్మచారి మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు కార్యాలయం చుట్టూ తిరగకుండా పనులు చేస్తున్నామని చెప్పారు. సంఘం నాయకులు ఇచ్చే సూచనలు సలహాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేందర్ పాటిల్, రాష్ట్ర కౌన్సిలర్ బస్వరాజ్, నాయకులు చంద్రశేఖర్, బాగారెడ్డి, నర్సింలు, మహబూబ్, వీరన్న, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆందోళన

సంగారెడ్డి జోన్ : కలెక్టర్ కార్యాలయ ఆవరణలో దివ్యాలాంగులకు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వికలాంగుల దినోత్సవ సమావేశం ముగిసిన అనంతరం భోజనానికి వెళ్లిన వారికి అన్నంలో వెంట్రుకలు రావడంతో ఆందోళనకు దిగారు. దూర ప్రాంతాల నుంచి కష్టపడి వచ్చిన తమకు ఇలాంటి భోజనం పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.